క్లుప్తంగా

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

అనపర్తి: మండల పరిధిలో బుధవారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు ప్రారంభం కానున్నాయని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. 29న మండలంలోని పులుగుర్త, పెదపర్తి, కుతుకులూరు, 30న రామవరం, పొలమూరు, మహేంద్రవాడ, వచ్చే నెల 1న అనపర్తి, కొప్పవరం, లక్ష్మీనరసాపురం, 2న పీరారామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడమే యాత్రల ముఖ్య ఉద్దేశమన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు నన్నయలో సెమినార్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సొసైటీ ఫర్ కమ్యూనిటీ రీసెర్చ్ ఇన్ యాక్షన్ (ఎస్‌సీఆర్‌ఏ) యూఎస్‌ఏ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభం కానుంది. స్నేహ సైకాలజీ అలుమ్ని అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ, జేఎస్‌ఎల్ సంయుక్త సహకారంతో 'గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మ్యాగ్జిమైజేషన్ – ఎ కమ్యూనిటీ పెర్స్పెక్టివ్' అనే అంశంపై ఈ సెమినార్ జరగనుంది. విశ్వశాంతి వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్యకర జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు.

3న శిష్టకరణ వనసమారాధన

మధురపూడి: శిష్టకరణ సేవాసమితి ఆధ్వర్యంలో మధురపూడి విమానాశ్రయం సమీపంలోని పుల్లయ్యతోటలో డిసెంబర్ 3వ తేదీన కార్తిక సమారాధన, సర్వసభ్య సమావేశం జరగనుంది. ఉదయం 6.30 గంటలకు రమా వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతం, కార్తిక దామోదరుని పూజతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 8 గంటలకు అల్పాహారం, అనంతరం ఆటల పోటీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనానంతరం సర్వసభ్య సమావేశం జరుగుతుంది. ఆధ్యాత్మిక తోలి పలుకులు, కోళ్లభాగ నివేదన, బహుమతుల ప్రదానం, సాయంత్రం 5 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుంది.

ఏబీవీపీ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

రాజానగరం: అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల పోస్టర్‌ను నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ యూనివర్సిటీ శాఖ కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ డిసెంబర్ 7 నుంచి 10 వరకూ ఢిల్లీలో ఏబీవీపీ జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు.

రేషన్ డీలర్ల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికుమార్



రవికుమార్

పెదపూడి: రాష్ట్ర రేషన్ షాపు డీలర్ల అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రస్తుతం కాకినాడ జిల్లా రేషన్ షాపు డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న బి.రవికుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర రేషన్ షాపు డీలర్ల అసోసియేషన్ కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు ఈ మేరకు ప్రకటించారని రవికుమార్ తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బైక్ చోరీల కేసులో వ్యక్తి అరెస్టు

బిక్కవోలు: తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో వివిధ బైక్ చోరీలకు పాల్పడిన కరప మండలం అరట్లకట్టకు చెందిన యాళ్ల వెంకటరమణను అరెస్ట్ చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బిక్కవోలు శివారు కాటన్‌దొర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటరమణను అదుపులోకి తీసుకుని విచారించడం తో చోరీల గుట్టు బయటపడిందన్నారు. వెంకటరమణ దొంగతనం చేసిన తొమ్మిది బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బిక్కవోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, సర్పవరం–1, పెద్దాపురం–3, పెదపూడి–1, కాకినాడ రెండో పట్టణం–1, పాయకరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 చోరీ చేసినట్టుగా గుర్తించామన్నారు. వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు.

జ్యోతీరావు పూలేకు ఘన నివాళి

పెదపూడి: మహాత్మా జ్యోతీరావు పూలే అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నతుడని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంపీపీ తులసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచులు లంక మల్లేశ్వరి, సుందరపల్లి ప్రమీల, పి.కృష్ణమూర్తి, నాని పట్టాభిరామన్న చౌదరి, ఎంపీడీఓ వీవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరే వేళ..

- నేడు 1,092 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- అందజేయనున్న మంత్రి అంబటి రాంబాబు
- లబ్ధిదారుల హర్షం



కాపవరంలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం, పశ్చిమగానుగూడెం, కోరుకొండ గ్రామాల్లో పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఈ గ్రామాల్లో అర్హులైన 1,092 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడానికి కాపవరంలో 31 ఎకరాలను కేటాయించారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా బుధవారం వీరికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. దీంతో చాలా ఏళ్లుగా సొంతిల్లు లేక అల్లాడిపోతున్న పేదలకు నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలం అందనుంది. కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో స్థలాలు లేని పేదలు 4,558 మందికి మొత్తం 125 ఎకరాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. గతంలోనే పలు గ్రామాల్లో 3,466 మంది లబ్ధిదారులకు ఒక్కక్కరికి 72 గజాలు (సెంటున్నర) చొప్పున 94 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలుగా అందించారు. బుధవారం మరో 1,092 మందికి 31 ఎకరాల విస్తీర్ణంపై హక్కు కల్పిస్తారు. కోరుకొండకు చెందిన 544 మందికి, కాపవరానికి చెందిన 434 మందికి, పశ్చిమగానుగూడెంలోని 114 మందికి లబ్ధి చేకూరనుంది.

ముంపునకు శాశ్వత పరిష్కారం

కోరుకొండ, సీతానగరం మండలాలకు గోదావరి ఎగపోటు వరదలితోతో ముంపు సమస్య ఎక్కువగా ఉంటోంది. ఈ రెండు మండలాల్లోని 8 గ్రామాలకు చెందిన 600 ఎకరాల పొలాలకు ఇబ్బంది కలుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కృషితో ముంపు సమస్యకు పరిష్కారం దొరకుతోంది. దీనిలో భాగంగా తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణానికి మంత్రి అంబటి రాంబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.91 కోట్లతో ఈ పథకం చేపడుతున్నారు. కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 53 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా రూ.38 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఇళ్ల స్థలాల పంపిణీ



పేదలందరికీ సొంతిళ్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం చేపడుతోంది. కోరుకొండ, కాపవరం, పశ్చిమగానుగూడెం గ్రామాల్లోని నిరుపేదలకు బుధవారం మంత్రి అంబటి రాంబాబు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. అలాగే వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రివర్స్ పంపింగ్ స్కీమ్‌కు శంకుస్థాపన చేయనున్నారు.

– పాపారావు, కోరుకొండ తహసీల్దార్

బడి.. చదువులమ్మ గుడి..

- కార్పొరేట్‌కు దీటుగా అనపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల
- నేడు ప్రారంభించనున్న మంత్రి అంబటి రాంబాబు



శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన సముదాయం

అనపర్తి: విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోన్న ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది నవశకానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే అనపర్తి శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చొరవ తీసుకుని నాడు–నేడులో రూ.3.26 కోట్ల నాబార్డ్ నిధులు మంజూరు చేయించారు. 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాల నూతన సొబగులద్దుకుంది. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు బుధవారం ఈ పాఠశాలను ప్రారంభించనున్నారు.

1947లో పాఠశాల నిర్మాణం

విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమన్న ఆలోచనతో అనపర్తికి చెందిన ద్వారంపూడి రామారెడ్డి(పెదరెడ్డి) ఏడు దశాబ్దాల క్రితం 10 ఎకరాల సొంత స్థలాన్ని దానంగా ఇచ్చి పాఠశాల ఏర్పాటుకు అంకురార్పణ చేశారు. దీంతో 1947 జూలై 21న శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభమై అనపర్తి ప్రాంత విద్యా వికాసానికి బాటలు వేసింది. ఈ పాఠశాల పలువురు రాజకీయ, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక నిపుణులను సమాజానికి అందించింది. 1990లో పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటి ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు పూనుకున్నారు. అయితే పాఠశాల పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కృషితో నాబార్డ్ నిధులతో పాఠశాలకు మొత్తంగా 22 గదులతో నూతన భవన సముదాయాన్ని నిర్మించారు.

ఓపెన్ ఆడిటోరియానికి ఎమ్మెల్యే సొంత నిధులు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూర్వ విద్యార్థిగా పాఠశాల ప్రాంగణంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి రూ.20 లక్షల సొంత నిధులు వెచ్చించారు. ఈ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ఆడిటోరియంను ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, గెస్ట్ రూం–1ను ఎంపీ మార్గాని భరత్‌రామ్, గెస్ట్ రూం–2ను రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇదే పాఠశాలలో మరో పూర్వ విద్యార్థి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి తన సొంత నిధులతో పాఠశాల ముఖద్వారం నిర్మించేందుకు ముందుకొచ్చారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే లక్ష్యం



పేదలకు ఇళ్ల స్థలాలుగా అందజేసే భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాపవరంలో సభ ఏర్పాట్ల పరిశీలన

మధురపూడి: నిరుపేదలకు సొంతిళ్లు అందించడం, రైతులు రాజు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. ఆ సందర్భంగా జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ నిరుపేదలకు సొంతిళ్లు ఉండకూడదన్న దుర్బుద్ధితో టీడీపీ, జనసేన నాయకులు కాపవరం, బూరుగుపూడి రైతుల భూమి పంపిణీకి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. కోర్టులో కేసులు వేసి, పేదల ఆశ్యాన్నుకుంటే అడ్డుపడ్డారన్నారు. అయితే భగవంతుడి ఆశీర్వాదంతో న్యాయస్థానం ఆ కేసులను కొట్టేసి, పేదలకు న్యాయం చేసిందన్నారు. ఈ మేరకు కాపవరంలోని 31 ఎకరాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, పార్టీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేషుల పోసి పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- జక్కంపూడి గణేష్
- వంగలపూడిలో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఆయన సోమవారం రాత్రి వంగలపూడిలో పల్లె నిద్ర అనంతరం మంగళవారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు వచ్చేలా చేస్తున్నారన్నారు. జగన్ పాలనపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని, మళ్లీ ఆయనను సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ మంతా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ కొండ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూర్రెడ్డి గంగాభవాని, పార్టీ నాయకులు కొండ భాస్కరరావు, చల్లమళ్ల సుజీరాజు, రంది సుదాకర్, రంది శంకరం, పేరిచర్ల శ్రీనివాసరాజు, నలమాటి అమర్‌రాజు, అంబటి రమణ, గుద్దటి అబ్బులు, మద్దుకూరి గాంధీ, బొబ్బిలి వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలికి ఆడుదాం ఆంధ్రా



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కె.విజయకుమారి

బిక్కవోలు: ప్రతిభా వంతులైన క్రీడాకారులను గుర్తించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి కె.విజయకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి 20 వరకూ గ్రామ స్థాయి, 21 నుంచి జనవరి 4 వరకూ మండల స్థాయి, జనవరి 5 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేపీ రూస్సీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

బిక్కవోలు: గత మూడు రోజులుగా మండలంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారంతో ముగిసింది. మంగళవారం కొంకుదురు, ఆరికరేవుల, మెల్లూరు గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి, ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగ వీరవేణి, ఎంపీటీసీ కొంకుదురు పీటీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

రాజానగరం: శిక్షణ సద్వినియోగం చేసుకుని, లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లకు మంగళవారం ఒకరోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీఓలు, పాల్గొన్నారు.

ఫర్నీచర్ క్లస్టర్ పనులు వేగవంతం చేయాలి



వడిశలేరులో ఫర్నీచర్ క్లస్టర్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రంగంపేట: జిల్లాలో ఫర్నీచర్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వడిశలేరులో ఫర్నీచర్ మానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటుచేయనున్న ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యాధునిక సాంకేతిక నిపుణులతో కలిగిన ఫర్నీచర్ అందుబాటులో తీసుకొచ్చేందుకు బొబ్బాళిక ఎస్‌పీవీల 10 శాతం భాగస్వామ్యంతో ప్రభుత్వం 20 శాతం గ్రాంట్‌తో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 110 ఎంఓల ద్వారా ఎస్‌పీవీల కంట్రిబ్యూషన్ 10 శాతం చెల్లించగా, ప్రభుత్వం తన వాటాగా 20 శాతం నిధుల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. క్లస్టర్ స్ట్రక్చరల్ నిర్మాణాల విషయంలో రాసున్న 10 రోజుల్లో పనులు ప్రారంభించి, నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీవీ డైరెక్టర్ మూర్తి, జిల్లా పరిశ్రమల అధికారి బి. వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళల ప్రగతికి 'కృషి'



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

రాజానగరం: గ్రామీణ మహిళలు స్వశక్తితో ప్రగతిని సాధించే దిశగా కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కృషి చేస్తోందని రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో కొబ్బరిపీచు, జనపనార ఉత్పత్తులపై గ్రామీణ మహిళలకు వారం రోజుల పాటు కేవీకేలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీటీఆర్ఐ డైరెక్టర్ మాట్లాడుతూ కేవీకేలో వృత్తిపర రంగానికి సంబంధించిన అంశాలతో పాటు స్వయం ఉపాధిపై నిరంతరం నైపుణ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో గోకవరం మండలానికి చెందిన 15 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడారు. చేతివృత్తుల విభాగం విశ్రాంత అధికారి కె. సుధాకర్ వర్షమేజరులో కలవచర్లకు చెందిన ఎం.శివకుమారి మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

అన్ని వర్గాలను ఆదుకున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.దొంతమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



జి.దొంతమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన జి.దొంతమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామంలోని 550 ఇళ్లను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఒక్కో ఇంటికి సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటు స్థానిక సమస్యలను కూడా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల వద్దకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ గోలి రమణ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోలి వెంకటలక్ష్మి, పార్టీ కన్వీనర్ చెక్కపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

పుష్కర నుంచి సాగునీటి విడుదల నిలిపివేత

సీతానగరం: పురుషోత్తపట్నం వద్ద గల తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటి విడుదలను మంగళవారం ఉదయం 10 గంటలకు నిలిపివేశారు. గోదావరి నీటిమట్టం 13 మీటర్లకు పడిపోవడంతో సాగునీటి విడుదలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం 11 గంటల వరకూ రెండు మోటార్ల ద్వారా 350 క్యూసెక్కుల సాగునీటిని వదిలారు. అనంతరం గోదావరి నీటిమట్టం తగ్గడంతో మంగళవారం ఉదయం 10 గంటల వరకూ ఒక మోటారు ద్వారా 175 క్యూసెక్కుల విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ జేఈ వినోద్ మాట్లాడుతూ గోదావరి నీటిమట్టం తగ్గిపోవడంతో నీటివిడుదల నిలిపివేశామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సామాగ్రిని తరలించే జనక లారీల రాకపోకలు సాగించడానికి వీలుగా రోడ్డు వేశారని, దాని కింద తూరలు అమర్చడం జరిగిందన్నారు. అయితే తూరలలో మట్టి చేరడంతో గోదావరి జలాలు పుష్కర పథకం వద్దకు చేరుకోవడం లేదన్నారు. పొక్లెయిన్‌తో తూరల వద్ద మట్టిని తొలగించే చర్యలు చేపట్టామని, అవి రెండు రోజుల్లో పూర్తవుతాయన్నారు. దానితో గోదావరి నీటిమట్టం పెరుగుతుందని, అప్పుడు సాగునీటి విడుదల చేస్తామన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం



మర్రిపూడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇలపల్లిలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన ఎంపీపీ కొప్పుల జ్యోతిర్మయి



కైకవోలులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు



ఫరిజల్లిపేటలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న వైఎస్ జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మర్రిపూడిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేము చిరంజీవి, ఉప సర్పంచ్ మేడిది చక్రం, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించడానికే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పలువురు వక్తలు అన్నారు. కైకవోలులో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి, ఉప సర్పంచ్ కొప్పిశెట్టి వీరబాబు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ టి.రాజు, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ కొప్పుల జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం ఇలపల్లిలో ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తొట్టల భద్రం, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొద్దు ముత్యాలరావు, సాధనాల రాంబాబు, పోతుల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆర్థిక భరోసా

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, ఆదర్శంగా నిలిచిన జగన్ సర్కారు మరోసారి అధికారంలోకి రావాలని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మందారపు వీర్రాజు, సర్పంచ్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, మాజీ సర్పంచ్ ఉండవల్లి రాజబాబు మాట్లాడుతూ అమ్మఒడి, కాపు నేస్తం, రైతు భరోసా, చేయూత, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక సంక్షేమ పథకాలతో అర్హులందరికీ ఆర్థిక భరోసా కల్పించారన్నారు. గ్రామ సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరించారు.